

మంత్రి అనగాని పేరుతో నకిలీ స్టిక్కర్



- ఇద్దరు అరెస్టు.. కారు సీజ్

8

పిన్నెల్లి అండతో రెచ్చిపోయారు

- పల్నాడు పోలీసుల తీరుపై అనేక ఆరోపణలు
- హైకోర్టు న్యాయవాది వేధింపుల వెనుక వైసీపీ ఒత్తిళ్లు
- వేధింపుల్లో కీలక సూత్రధారిగా డీఎస్పీ పల్లంరాజు

వెలుగుల సందడి



నేడు దీపావళి పర్వదినం

- కొనకుండానే పేలుతున్న టపాకాయలు
- పలు ప్రాంతాల్లో వర్షం.. కొనుగోళ్లపై ప్రభావం

వెలుగుల పండుగ వచ్చేసింది. కులమతాలకు అతీతంగా, చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా అందరూ సంతోషంగా చేసుకునే పండుగకు అంతా సిద్ధమయ్యారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, దుష్టశక్తిపై దైవశక్తి గెలుపునకు చిహ్నంగా, చీకటిని పారద్రోలి వెలుగులు తెచ్చే పండుగగా తెలుగునాట దీపావళికి అత్యంత ప్రాధాన్యం ఉంది. గురువారం దీపావళి కాగా బుధవారం నుంచి ఆ సందడి కనిపించింది. గురువారం పండుగ సెలవు కావడంతో విద్యా సంస్థల్లో బుధవారమే దీపావళి పర్వదిన వేడుకలు విద్యార్థుల కేరింతల మధ్య జరిగాయి. దీపాలతో అలంకరణలు, టపాకాయల కాల్చి విద్యార్థులు సందడి చేశారు.

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రాలైన గుంటూరు, బాపట్ల, నరసరావుపేటలతో పాటు మున్సిపల్, మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లోనూ టపాకాయల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా ఈ ఏడాది టపాకాయల దుకాణాలు వెలిశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా ఆ సంతోషాన్ని సంబరంగా జరుపుకునే అవకాశం ఉందని వ్యాపారులు పెద్దఎత్తున దుకాణాలు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. వ్యాపారుల అంచనాకు తగ్గట్లుగానే బుధవారం మధ్యాహ్నం నుంచి దుకాణాల వద్ద

(మిగతా 8లో)



గుంటూరులో వర్షానికి నీట మునిగిన దుకాణాలు



నరసరావుపేటలోని స్టేడియంలో దీపావళి బాణసంచా షాపులు



గుంటూరులో కొనుగోళ్ల సందడి



చిలకలూరిపేటలో ప్రమిదలు, పూలతో అలంకరణ

వరదలా.. విద్యుత్

- కుడి కాల్వ జల విద్యుత్ ఖిల్లా
- రోజూ 79.25 మెగా వాట్ల ఉత్పత్తి
- టెయిల్‌పాండ్ నుంచి ఒక మిలియన్..
- విద్యుత్ ఉత్పతిలో కీలకంగా ప్రాజెక్టులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వరద పోటెత్తుతుండగా.. జల విద్యుత్ ఉత్పత్తి నిరాటంకంగా కొనసాగుతూ ఉంది. గతంలో ఎన్నడూ లేనట్లుగా మూడు నెలల నుంచి నాగార్జున సాగర్ జలాశయం నుంచి దిగువకు నీటి విడుదల జరుగుతుండగా కుడి కాల్వ పరిధిలోని జల విద్యుత్ కేంద్రాలు నిరంతరాయంగా పని చేస్తూనే ఉన్నాయి. సాగు నీటి సరఫరా కుడి కాల్వకు పుష్కలంగా జరుగుతుండగా.. ఆయకట్టు పరిధిలో ఒక వైపు పంటలతో కళకళలాడుతోంది. మరోవైపు విద్యుత్ పెద్దఎత్తున ఉత్పత్తి జరుగుతోంది. రాష్ట్రానికి అవసరమైన విద్యుత్ కొరతను సాగర్ కుడి కాల్వ తీరుస్తోంది. కుడి కాల్వ.. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు విద్యుత్‌కు ఖిల్లాగా నిలిచింది. కుడి కాల్వ పరిధిలోని ఆయా కాల్వలపై, కుడి గట్టు విద్యుత్ కేంద్రాల ద్వారా ప్రతిరోజూ 79.25 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. జూలైలో ప్రారంభమైన వరద ఇప్పటికీ కొనసాగుతోంది. సాగర్ జలాశయం ద్వారా ఆగస్టు మొదటి వారం నుంచి కుడికాల్వకు నీరు విడుదల చేస్తున్నారు. కుడి కాల్వకు 10,160 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో కుడి గట్టు మీద ఉన్న జల విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పతి జరుగుతోంది. రెండు యూనిట్ల ద్వారా 35 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. మూడో యూనిట్ ద్వారా కూడా విద్యుత్ ఉత్పత్తికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. యూనిట్ ఒకటి ద్వారా 0.422 మిలియన్ యూనిట్లు, రెండో యూనిట్ ద్వారా 0.404 మినియన్ యూనిట్లు మొత్తంగా 0.826 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేస్తున్నట్లు సంబంధిత అధికారి తెలిపారు. ఈ నెల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 24 మిలియన్ యూనిట్లు కాగా ఇప్పటికీ 23.928 మినియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు. ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 128 మిలియన్ యూనిట్ల లక్ష్యం కాగా ఇప్పటి వరకు 95.509 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి జరిగింది.



టెయిల్ పాండ్ ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి యూనిట్



గుంటూరు బ్రాంచ్ కెనాల్‌పై విద్యుత్ ప్లాంట్

కుడి కాల్వపై 27 జల విద్యుత్ కేంద్రాలు

కుడికాల్వ పరిధిలో 27 జలవిద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి. వీటి సామర్థ్యం 44.25 మెగావాట్లు కాగా రోజుకు 9.55 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. కుడి కాల్వకు నీటి సరఫరా ఉంటే ఈ ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. గుంటూరు బ్రాంచ్ కెనాల్ పరిధిలో 22.9 మెగా వాట్ల సామర్థ్యం కలిగిన 14 విద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి. అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో 8(16.7 మెగా వాట్లు), బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్ పరిధిలో 2.4 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడు, ఒంగోలు బ్రాంచ్ కెనాల్‌పై 1.5 మెగావాట్ల సామర్థ్యంతో ఒకటి, జూలకట్టు బ్రాంచ్ కెనాల్‌పై ఒక మెగావాట్ సామర్థ్యం కలిగిన ఒక ప్లాంట్ ఉంది. సాగర్‌కు దిగువన రెంటచింతల మండలం సత్రశాల సమీపంలో టెయిల్‌పాండ్ ప్రాజెక్టు నిర్మించారు. సాగర్ జలాశంలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నప్పుడు జలవిద్యుత్ ద్వారా విడుదల చేసిన నీటిని నిల్వ చేసి మళ్లీ తిరిగి జలాశంయలోకి ఎత్తిపోయడానికి నిర్మించిందే టెయిల్‌పాండ్ ప్రాజెక్టు. దీని నీటి నిల్వ సామర్థ్యం ఆరు టీఎంసీలు. ఈ ప్రాజెక్టులో నీటి నిల్వ బ్యాక్ వాటర్ సాగర్ డ్యామ్ వరకు నిలుస్తుంది. నీటిని రివర్సబుల్ టర్బయిన్ల ద్వారా జలాశయంలోకి ఎత్తిపోస్తారు. నదికి వరద ఉన్న సమయంలో జలవిద్యుత్ ఉత్పత్తి చేయడానికి వీలుగా 25 మెగా వాట్ల సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లు ఉన్నాయి. వీటికి 50 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉంది. రెండు ప్లాంట్ల నుంచి రోజూ 1.02 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. వరద నీరు కొనసాగుతుండటంతో ఆగస్టు నుంచి ఇక్కడ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

వెంకన్న సేవకు ఇద్దరు

- టీటీడీ బోర్డులో జంగా, తమ్మిశెట్టిలకు చోటు
- పల్నాడు జిల్లా నుంచి మళ్లీ జంగాకు అవకాశం
- గుంటూరు జిల్లా నుంచి చేనేతవర్గ మహిళకు పదవి



జంగా కృష్ణమూర్తి



తమ్మిశెట్టి జానకీదేవి

పిడుగురాళ్ల, మంగళగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇల వైకుంఠంగా ప్రసిద్ధి చెంది.. ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఉన్న తిరుమల వేంకటేశ్వరుడి సేవకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఇద్దరికి చోటు దక్కింది. కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి టీటీడీ బోర్డులో చోటు కోసం పలువురు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం టీటీడీ పాలకవర్గ మండలిని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో పల్నాడు జిల్లా నుంచి మళ్లీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి, గుంటూరు జిల్లా నుంచి తమ్మిశెట్టి జానకీదేవికి అవకాశం లభించింది. 1999, 2004లో ఎమ్మెల్యేగా గెలుపొందిన దాచేపల్లి మండలం గామాలపాడుకు చెందిన జంగా కృష్ణమూర్తి 2004, 2006లో రెండు దఫాలుగా తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా ఉన్నారు. 2024 ఎన్నికలకు ముందు జంగా కృష్ణమూర్తి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు జంగా కృష్ణమూర్తిని టీటీడీ బోర్డు మెంబర్‌గా నియ మించారు. టీడీపీలో బీసీలకు సముచిత స్థానం కల్పిం చేలా చంద్రబాబు తీసుకున్న నిర్ణయానికి గురజాల ఎమ్మెల్యే యరపతి నేని శ్రీనివాసరావు, కూటమి నేతలు, బీసీ సంఘాలు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. టీటీడీ బోర్డు మెంబరుగా నియమితులైన జంగా కృష్ణమూర్తిని ఎమ్మెల్యే యరపతినేని అభినందించారు.

మంగళగిరి నుంచి మళ్లీ మహిళకే..

టీటీడీ ధర్మకర్తల మండలిలో మంగళగిరికి చెందిన తమ్మిశెట్టి జానకీదేవికి చోటు లభించింది. టీటీడీ ధర్మకర్తల మండలిలో మంగళగిరి నుంచి ప్రాతినిథ్యం వహించిన వారిలో జానకీదేవి రెండోవారు. గతంలో కాండ్రు కమల తొలిసారిగా టీటీడీ బోర్డులో స్థానం పొందగా ప్రస్తుతం మళ్లీ మహిళకే పదవి వరించింది. మంగళగిరి నుంచి టీటీడీలో ప్రాతినిథ్యం వహించిన ఇద్దరు కూడా చేనేత వర్గానికి చెందినవారు కావడం విశేషం.

పిన్నెల్లి అండతో రెచ్చిపోయారు

- పల్నాడు పోలీసుల తీరుపై అనేక ఆరోపణలు
- హైకోర్టు న్యాయవాది వేధింపుల వెనుక వైసీపీ ఒత్తిళ్లు
- వేధింపుల్లో కీలక సూత్రధారిగా డీఎస్పీ పల్లంరాజు
- ఆయన చెప్పినట్టు చేసిన ఎస్ఐ రబ్బానీ, కానిస్టేబుల్ వెంకటరావు
- పల్లంరాజుపై ఆది నుంచి ఆరోపణలు
- విజయవాడ, కాకినాడలో అనేక అక్రమాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

విజయవాడలో హైకోర్టు న్యాయవాది హరిబాబును పల్నాడు పోలీసులు వేధించడం వెనుక అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హస్తం ఉందని తెలుస్తోంది. ఆయన అండదండలు చూసుకుని అప్పటి గురజాల డీఎస్పీ ఎ.పల్లంరాజు, పిడుగురాళ్ల ఎస్ఐ రబ్బానీ, కానిస్టేబుల్ వెంకటరావు వీరంగం వేశారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. హరిబాబుపై జరిగిన వేధింపులకు సంబంధించి పిడుగురాళ్ల పీఎస్‌లో నమోదైన కేసు విజయవాడ పటమట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన పోలీసులు పిన్నెల్లి అనుచరుడు కర్నాటి వీరభద్రరావు వైపు వకల్తా తీసుకున్నారు. హరిబాబు నుంచి వీరభద్రరావు తీసుకున్న అప్పును తిరిగి ఇప్పించకపోగా అతడి ఆస్తులను బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించారు. దీంతోపాటు హరిబాబు వద్ద నుంచి రూ.కోటి వరకు లాగేశారు. ఈ విషయాలన్నీ ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వాటితోపాటు డీఎస్పీ పల్లంరాజు పోలీసు ఉద్యోగంలో అడుగుపెట్టినప్పటి నుంచి చేసిన అక్రమాల చిట్టా తాజాగా బయటకు వస్తోంది.

విజయవాడలో పల్లంరాజు మార్కు

పల్లంరాజు 1991లో ఎస్ఐగా పోలీస్ శాఖలో అడుగుపెట్టారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత నుంచి ఆయన సర్వీసు మొత్తం విజయవాడలో సాగింది. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి చెందిన పల్లంరాజు 20 ఏళ్లకుపైగా విజయవాడలో పని చేశారు. ఎస్ఐగా కమిషనరేట్‌లో పోస్టింగ్ తీసుకుని ఇక్కడే ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఇన్‌స్పెక్టర్‌గా పటమట, టాస్క్‌ఫోర్స్ వంటి కీలక పోలీస్ స్టేషన్లలో పనిచేశారు. నాడు విజయవాడలో జరిగిన భూవివాదాల కేసుల్లో సెటిల్‌మెంట్లు చేసి లక్షలాది రూపాయలను వసూలు చేశాడన్న ఆరోపణలు ఉన్నాయి. నీతి నిజాయితీగా పనిచేసి ఒక మార్కును వేయించుకున్న అధికారులకంటే కమిషనరేట్‌లో పల్లంరాజు మార్క్ ఎక్కువగా కనిపిస్తోంది. పోలీస్ శాఖలో ఎవరిని కదిపినా పల్లంరాజు గురించి పెద్ద చిట్టా విప్పుతున్నారు. ఈయన ఇక్కడ పనిచేసినప్పుడే భారీగా ఆస్తులను కూడబెట్టుకున్నట్టు సమాచారం. విజయవాడలో ఉన్న ప్రముఖ రాజకీయ నేతలు, వ్యాపారవేత్తలతో పాటు అక్రమాలకు పాల్పడే మాఫియాలతో ఈయనకు ఇప్పటికీ సంబంధాలు ఉన్నాయని చెప్పుకుంటున్నారు. పోలీస్‌శాఖలో పల్లంరాజును అతడి స్నేహితులు బిగ్‌షాట్ అని ముద్దుగా పిలుచుకుంటారని.. దీన్ని బట్టి ఆయన ఏ స్థాయిలో ఉన్నారో ఇట్టే తెలుస్తోంది.

కాకినాడలోనూ అనేక దందాలు

డీఎస్పీగా పదోన్నతి పొందిన ఈయనకు కాకినాడలో పోస్టింగ్ ఇచ్చారు. 2014 నుంచి 2019 వరకు అక్కడ అనేక అక్రమాల భాగోతాలు నడిపినట్లు సమాచారం. అక్కడ సీసీఎస్ డీఎస్పీగా పని చేశారు. విశాల్ గున్నీ ఎస్పీగా ఉన్నప్పుడు క్రికెట్ బెట్టింగ్ కేసులను పల్లంరాజుకు అప్పగించారు. ఆ సమయంలో అక్కడే అదనపు ఎస్పీగా పనిచేసిన రవిశంకర్‌రెడ్డికి విధేయుడిగా మారారు. విశాల్ గున్నీ అప్పగించిన బాధ్యతలతో పల్లంరాజు తనకు తాను ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఏదైనా ఒక కేసును దర్యాప్తు చేస్తున్న అధికారికి సహాయకులుగా ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు ఉంటారు. పల్లంరాజు అనధికారికంగా ఎస్పీ స్పెషల్ పార్టీ పేరుతో ఒక టీంను ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. ఒక క్రికెట్ బుకీని అరెస్టు చేసి వారానికి పైగా రహస్య ప్రదేశంలో ఉంచారని, ఆ బుకీ ద్వారా ఇతర బుకీలకు ఫోన్లు చేయించి కోట్లాది రూపాయలను వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ డబ్బులతోనే విజయవాడకు చెంతనే ఉన్న తాడేపల్లిలో ఖరీదైన స్థలాన్ని కొనుగోలు చేసి మొక్కల ప్రేమికుడిగా మారినట్టు తెలిసింది. ఈ స్థలంలో ఈయన ఒక నర్సరీని నడుపుతున్నట్టు సమాచారం. ఈ స్థలాన్ని ఈయన కొనుగోలు చేయలేదని, ల్యాండ్ సెటిల్‌మెంట్‌లో కానుకగా తీసుకున్నారన్న ప్రచారం కూడా నడుస్తోంది. 2019 తర్వాత కూడా కాకినాడలో పనిచేయాలని పల్లంరాజు భావించారని, అయితే అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఈయన్ను పనికట్టుకుని మరీ బదిలీ చేయించినట్టు తెలిసింది. చంద్రశేఖర్‌రెడ్డికి అనుచరులుగా ఉన్న బుకీలను వేధించి కోట్లాది రూపాయలు వసూలు చేయడమే దీనికి కారణమని సమాచారం.

పిన్నెల్లి అనుచరుడిగా అవతారం

రవిశంకర్‌రెడ్డి పల్నాడు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయనే స్వయంగా పల్లంరాజును గురజాల డీఎస్పీగా రప్పించుకున్నారని సమాచారం. ఇక్కడికి వచ్చిన తర్వాత పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి అనుచరుడిగా పనిచేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగానే హైకోర్టు న్యాయవాది హరిబాబుపై సర్వీసు రివాల్వర్ గురిపెట్టి మరీ ఆయన ఆస్తులు కర్నాటి వీరభద్రరావు పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించినట్టు బాధితుడు ఆరోపిస్తున్నాడు. ఎస్ఐ రబ్బానీ, కానిస్టేబుల్ వెంకటరావు పలుదఫాలుగా హరిబాబు నుంచి రూ.కోటి వరకు వసూలు చేశారని, ఈ డబ్బులను ఈ ముగ్గురు కలిసి పంచుకున్నారని ప్రచారం నడుస్తోంది. కేసు దర్యాప్తు ముందుకు సాగే కొద్దీ ఈ డబ్బుల లెక్కలు తేలడం ఖాయమని అధికారులు చెబుతున్నారు.

ఏపీ బీసీ సంక్షేమ సంఘం రూ.10 లక్షల విరాళం



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న కేసన శంకరరావు

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)కి రూ.10 లక్షలు అందజేశారు. సచివాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు నేతృత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ.10 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవితను కలిసి 12 అంశాలతో కూడిన విజ్ఞాపన పత్రాలను అందజేసినట్లు కేసన తెలిపారు. ఎన్నికల హామీ మేరకు చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీల రిజర్వేషన్‌లను పునరుద్ధరించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీల లానే బీసీ ఆత్మరక్షణ కోసం చట్టం చేసి వెంటనే అమలు చేయాలని కోరారు. బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి, వాటిని వెంటనే భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 50 శాతం వాటా ఇవ్వాలని కోరారు. ప్రతి జిల్లాలో రెండు ఎకరాల స్థలం కేటాయించి, రూ.100 కోట్ల బడ్జెట్‌తో బీసీ భవనాల నిర్మాణం మొత్తం 26 జిల్లాల్లో చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, పలువురు నాయకులున్నారు.

వెలుగుల సందడి

(7వ పేజీ తరువాయి)

కొనుగోళ్ల సందడి నెలకొంది. ఇక పూలు, ఇతర పూజా సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిటలాడాయి. పలువురు ఇళ్లను దీపాలతో అలంకరించుకున్నారు. వ్యాపార కేంద్రాలు, ప్రైవేటు కార్యాలయాలు, పలు ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో నిండిపోయాయి.

● భారీగా పెరిగిన ధరలు

ఈ సారి దీపావళిపై ధరల ప్రభావం అధికంగా ఉంది. గడిచిన రెండేళ్లలో 60 శాతం పెరగగా ఈ ఏడాది మరో 20 శాతానికి పైగా పెరిగాయి. పెరిగిన ధరలతో టపాసులు కాల్చకుండానే పేలిపోతున్నాయి. కిందటేడాది రూ.60 నుంచి 90కి పెరిగిన సాదా కాకరపువ్వొత్తుల ధర ఇప్పుడు ఇంకో ముప్పై రూపాయలు పెరిగింది. భూచక్రాల బాక్సు రూ.260 నుంచి 300కు పెరిగింది. ఒక కిలో రూ.100 ఉండే మతాబాలు ఈ ఏడాది పావు కిలో రూ.100 అయ్యాయి. భారీగా పెరిగిన ధరలతో కొనుగోలుదారులు బెంబేలెత్తిపోతున్నారు. చీరాల సహా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏటా మూడు వందలకు పైగా లైసెన్సుడ్ షాపులు ఉంటాయి. వీటిలో కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంది. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం రావడంతో దీపావళి ప్రాధాన్యం పెరిగింది. ఆ కారణంగా అనేక మంది కొత్తవారు షాపులు తెరవడానికి పూనుకున్నారు. భారీగా ఉన్న లైసెన్సు ఫీజులను సైతం లెక్క చేయకుండా షాపులు పెట్టారు. రెండు మూడు రోజులుగా వాతావరణం సానుకూలంగానే ఉన్నా బుధవారం మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడింది. బుధవారం సాయంత్రం నుంచి వ్యాపారం జోరుగా సాగుతుందని వ్యాపారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. సరిగ్గా అదే సమయంలో ఒక్కసారిగా వర్షం విరుచుకుపడింది. దీంతో అప్పటి వరకు సాగిన వ్యాపారాలు ఒక్కసారిగా ఆగిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా టెంట్లతో ఏర్పాటు చేసుకున్న దుకాణాలు టపాసులకు ఎలాంటి రక్షణ ఇవ్వలేకపోయాయి. దీంతో లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి తెచ్చుకున్న టపాసులు వర్షానికి తడిచిపోవడంతో వ్యాపారులు అల్లాడిపోయారు. వర్షంతో బాణాసంచా వ్యాపారుల గుండెల్లో గుబులు రేకెత్తించింది.

హ్యాండ్‌బాల్ బాలబాలికల రాష్ట్ర జట్ల ఎంపిక

తెనాలి అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ అండర్-14 జాతీయ స్థాయి బాల బాలికల జట్లను హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రకటించింది. తెనాలి డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో మెరుగైన ప్రతిభను కనబరిచిన క్రీడాకారులతో రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. బాలుర జట్టు గుంటూరు జిల్లా నుంచి వల్లెపు హరీష్, ఎలగల అనిల్, పచ్చా కార్తీక్, మాలిశెట్టి విజిష్, చిత్తూరు జిల్లా నుంచి బుక్కి గోవర్ధన నాయక్, బుస్సా సాయినాథ, ప్రకాశం జిల్లా నుంచి యర్రగుంటల దయాసాగర్, మొలకల చిరుత, కృష్ణా జిల్లా నుంచి కడియం సంతోష్, రవిస యేసు, బొమ్మల యశ్వంత్, విజయనగరం జిల్లా నుంచి గురుగువెల్లి సోమశేఖర్, శ్రీకాకుళం నుంచి అరిక చరణ్, నెల్లూరు నుంచి మామిడి గిరీష్, వెస్ట్ గోదావరి నుంచి కుందరపు నాగేంద్ర, కడప నుంచి కాశీనగరి హేమసుందర్ ఎంపికయ్యారు.

బాలికల విభాగంలో..

బాలికల విభాగంలో గుంటూరు జిల్లా నుంచి రమావత్ సింధూర, సంకూరి హదస్సా, విస్సా జువిత, తిరుమలశెట్టి నాగశ్రావ్య, గుండెగ బాలభవ్య, కృష్ణా జిల్లా నుంచి పఠాన్ సఫియా, బావిరెడ్డి జాహ్నవి, ప్రకాశం జిల్లా నుంచి గడ్డం చందు, వాడపల్లి వర్షిత, చిత్తూరు నుంచి మామిళ్ల నిహారిక, మోక్షిత, కర్నూలు నుంచి షహనాజ్, విజయనగరం నుంచి హారిక, కడప జిల్లా నుంచి కావ్య, శ్రీకాకుళం జిల్లా నుంచి ప్రసన్నకుమారి, అనంతపురం జిల్లా నుంచి కొత్తపల్లి శైలజ ఎంపికయ్యారు. ఛత్తీస్‌ఘడ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఈ క్రీడాకారులు రాష్ట్ర జట్టులో పాల్గొంటారు.



హ్యాండ్‌బాల్ బాల బాలికల రాష్ట్ర జట్టు క్రీడాకారులు

కూటమి పాలనలో విద్యావ్యవస్థలో మార్పులు



మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

వేమూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి పాలన ద్వారా విద్యా వ్యవస్థలో ప్రామాణికతతో కూడిన మార్పులు వచ్చాయని, ఈ మార్పు ద్వారా బహుళ ప్రయోజనాలు కలుగుతాయని ఏపీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా పర్యటనలో భాగంగా ఆయన వేమూరు విచ్చేశారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ గత జగన్ పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని అన్నారు. ఆనాటి ఇబ్బందులు కొనసాగకుండా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. మంత్రి సూచనల మేరకు కమిషనర్ విజయరామ రాజు ప్రత్యేక చర్యలకు పూనుకోవడం వలన మంచి రోజులు వచ్చాయన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం ప్రతి శుక్రవారం చర్చించడం, చర్చల్లో సమీక్షించిన అంశాలపై స్పందించడం సంతోషదాయకమన్నారు. 117 జీవో ద్వారా విద్యారంగం దెబ్బతిందనీ, దాన్ని మంత్రి లోకేశ్ రద్దు చేసేందుకు అంగీకారం తెలపడం హర్షణీయమన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు చేయాలని కోరామన్నారు. రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షులు హరిపూర్ణ ప్రసాద్, బాపట్ల జిల్లా అధ్యక్షులు శ్రీనివాసకుమార్, గౌరవాధ్యక్షులు రామచంద్రరావు పాల్గొన్నారు.

మంత్రి పేరుతో నకిలీ స్టిక్కర్

● ఇద్దరు అరెస్టు.. కారు సీజ్

రేపల్లె, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నకిలీ ఎమ్మెల్యే స్టిక్కర్‌తో తిరుగుతున్న కారును గుర్తించిన పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, కారును సీజ్ చేసినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ విజయవాడకు చెందిన అభినయ్ అనే అతను రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎమ్మెల్యే స్టిక్కర్‌ను విజయవాడలోని స్టిక్కరింగ్ షాపు యజమాని సల్మాన్ వద్ద నకిలీది తయారు చేయించాడు. ఏపీ07డీఎస్8322 నంబరు గల కారుకు ఆ నకిలీ స్టిక్కర్‌ను అతికించుకుని తిరుగుతుండటంతో గుర్తించిన పోలీసులు కారు యజమాని అభినయ్, స్టిక్కర్ తయారు చేసిన సల్మాన్‌ను అరెస్టు చేశారు. కారును సీజ్ చేసి కోర్టుకు పెట్టనున్నట్లు తెలిపారు.నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్యేలు, మంత్రుల స్టిక్కర్లను డూప్లికేట్ చేసి ఇస్తే స్టిక్కర్ షాపుల యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ మల్లికార్జునరావు

ఆలయాల్లో ఆభరణాల బాధ్యత అధికారులదే

● దేవదాయ శాఖ గుంటూరు జోన్ ఏసీ, జేవీవో డి.శ్రీనివాసరావు (వాసు)



గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో ఆలయాలకు సంబంధించిన ఆభరణాల బాధ్యత సంబంధిత ఆలయ అధికారులదేనని దేవదాయ ధర్మాదాయ శాఖ గుంటూరు జోన్ అసిస్టెంట్ కమిషనర్, జువెలరీ వెరిఫికేషన్ అధికారి (జేవీవో) డి.శ్రీనివాసరావు (వాసు) తెలిపారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ దాతలు ఆలయాలకు విరాళాలు, వస్తువులు, ఆభరణాలు బహూకరించిన సమయంలో అధికారులచే ధ్రువీకరించిన తగిన రసీదు పొందాలని సూచించారు.



మీ పరిధిలో ఎన్ని ఆలయాలు ఉన్నాయి?

జేవీవో: గుంటూరు జోన్ పరిధిలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో 6(ఎ), 6(బీ), 6(సీ) క్యాడర్ కింద 600 ఆలయాలు ఉన్నాయి. అన్ని ఆలయాల్లో తనిఖీలు చేస్తానే ఉంటాం.

ఆలయాల ఆభరణాల రికార్డు ఎప్పుడు పరిశీలిస్తారు?

జేవీవో: ఆలయాలకు సంబంధించిన ఆభరణాల రికార్డును ప్రతి 3 ఏళ్లకు ఒక పర్యాయం పరిశీలన చేస్తాం. రికార్డును ఎప్పటికప్పుడు ఆలయ అధికారులు పూర్తిగా అప్‌డేట్‌లో ఉంచుకోవాలి.

తనిఖీలకు వెళ్లినప్పుడు ఏమి పరిశీలిస్తారు?

జేవీవో: ఆలయాల్లో ఆభరణాల తనిఖీలకు వెళ్లినప్పుడు ఆలయానికి సంబంధించిన అప్రైజర్ రిజిస్టర్, ఇన్వెంటరీ రిజిస్టర్, స్వాధీన రిజిస్టర్, లాకరు, స్ట్రాంగ్ పరిశీలిస్తాం. పూర్తి భద్రతా చర్యలు పాటించాలని అధికారులకు సూచిస్తాం.

అధికారులు బదిలీ అయినప్పుడు రిజిస్టర్ల సంగతేంటి?

జేవీవో: అధికారులు బదిలీ అయినప్పుడు తప్పనిసరిగా రిజిస్టర్లను పరిశీలన చేయాలి. బదిలీ అయిన అధికారి చూపించాలి, బాధ్యతలు చేపట్టే అధికారి వాటిని సరి చూసుకోవాలి.

ఆభరణాల విషయంలో అక్రమాలు జరిగితే?

జేవీవో: ఆలయాలకు సంబంధించిన బంగారం, వెండి వస్తువుల విషయంలో అక్రమాలు జరిగితే దానికి పూర్తి బాధ్యత సంబంధిత ఆలయ అధికారిదే. వీటి లోటుపాట్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలాగా సిఫారసు చేస్తాం.

దీపావళి శుభాకాంక్షలు : మంత్రి అనగాని



రేపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమల్లో భాగంగా మహిళలకు మూడు గ్యాస్ సిలెండర్లు దీపావళి పండగ నుంచి ఉచితంగా అందించనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు. దీపావళి పండగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కట్టెల పొయ్యి కష్టాలు తప్పించి గ్యాస్ కనెక్షన్లు ఇప్పించి నేడు ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్‌లను ఇస్తున్నది కూటమి ప్రభుత్వమేనన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఎప్పుడూ అండగా ఉండటంతోపాటు వారు ఆర్థికంగా బలపడే విధంగా కృషి చేస్తుందన్నారు.

2లోగా ఫిల్మ్ స్టడీస్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

పెదకాకాని, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఫిలిం స్టడీస్ విభాగంలో ప్రవేశాలకు నవంబరు 2ను ఆఖరు తేదీగా నిర్ణయించినట్లు విభాగం కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.మధుబాబు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువతకు ఫిలిం మేకింగ్ పట్ల పూర్తి స్థాయిలో అకడమిక్ నాలెడ్జిని అందించే ఉద్దేశంతో ఆచార్య జి.నాగార్జున యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ టీవీ అండ్ ఫిలిం స్టడీస్ విభాగం రెండేళ్ల ఎం.ఎ ఫిల్మ్ స్టడీస్ కోర్సు ప్రారంభించిందనీ, ఆసక్తి కల విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 30,774 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద రెండు గేట్ల ద్వారా 44,290 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. వీటిలో 16 వేల క్యూసెక్కులు పవర్ జనరేషన్ ద్వారా విడుదల అవుతున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123, 132, 142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

36,108 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 29,664 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 36,108 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 23,835 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	15500	334	9000	15000
నెంబరు. 5	9500	14000	నెంబరు. 5	9500	10000
273	9000	11500	273	12000	13000
341	9500	16000	341	9500	16700
4884	9000	13500	4884	--	--
సూపర్ 10	10500	13500	సూపర్ 10	10000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18000	తేజ	10900	18300
బ్యాడిగి	8000	14500	బ్యాడిగి	9500	14000
దేవనూరు డీలక్స్	9000	13000	దేవనూరు డీలక్స్	11000	11000
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	5000	11000



సమావేశానికి హాజరైన కలెక్టర్ జె.వెంకటమురళి, అధికారులు

వరద బాధితులకు తక్షణమే పరిహారం అందించాలి

● కలెక్టర్‌కు సూచించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

బాపట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వరద బాధితులకు నష్టపరిహారం తక్షణమే అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం వీక్షణ సమావేశం ద్వారా కలెక్టర్ జె.వెంకటమురళికి సూచించారు. వరద బాధితులకు బీమా నష్టపరిహారం చెల్లింపులపై సంబంధిత కంపెనీల ప్రతినిధులు, కలెక్టర్లతో నిర్వహించిన ఈ సమావేశంలో సాంకేతిక సమస్యలతో బీమా విడుదల కాకపోవటంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్

బాపట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం, బాపట్ల జిల్లాల ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఎస్.గణేశ్వరరావు నూతనంగా బాధ్యతలు చేపట్టి బుధవారం కలెక్టర్ జె.వెంకటమురళిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల చీఫ్ మేనేజర్ వర్ల ఆనంద్, మేనేజర్ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జాతి ఐక్యతకు పునాదులు వేసిన పటేల్ చిరస్మరణీయులు

● కలెక్టర్ జె.వెంకటమురళి



విద్యార్థులు, అధికారులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జాతి ఐక్యతకు పునాదులు వేసిన గొప్ప నాయకుడు సర్దార్ వల్లభాయ్‌పటేల్ చిరస్మరణీయులని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. పటేల్ జయంతిని పురస్కరించుకొని బుధవారం బాపట్ల పట్టణంలో రాష్ట్రీయ ఏక్తాదివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి విద్యార్థులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్ దగ్గర నుంచి పాతబస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. జాతీయ ఐక్యతపై విద్యార్థులు, ప్రజలతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. మనమంత సోదరభావం, ఐక్యతతో మెలగాలంటూ విద్యార్థులు మానవహారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలంతా బేధాభిప్రాయాలను విడిచిపెట్టి జాతీయ ఐక్యత భావంతో మెలగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ కె.పాల్‌కుమార్, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ ఐక్యత దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధులు తొలి హోంమంత్రి సర్దార్‌వల్లభాయ్‌పటేల్ పటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో కళాశాల స్టూడెంట్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ డి.నిరంజన్‌బాబు, కె.రాజేంద్ర, వై.శృతి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● బాపట్లరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉక్కుమనిషి మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా బుధవారం బాపట్ల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బాపట్ల ఎంపీడీవో బి.బాబురావు, కార్యాలయ సిబ్బంది పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శరత్‌బాబు, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● కర్లపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సమైక్యతకు ప్రతిఒక్కరు కృషి చేయాలని కర్లపాలెం తహసీల్దార్ కెవిటి సుందరమ్మ అన్నారు. బుధవారం జాతీయ సమైక్యత దినోత్సవం, పటేల్ జయంతి సందర్భంగా స్థానిక కార్యాలయం వద్ద సర్దార్ వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి స్థానిక మండలస్థాయి అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ఎంపిడివో ఏ శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారులు ఎం.మనోరంజని, ఎస్.విజయశ్రీ, గ్రామసర్పంచ్ లలితకుమారి, కార్యదర్శి సునీత, ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్‌రెడ్డి, వేణమాధవ్, పోలీసురావు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

● వేమూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రం వేమూరులో బుధవారం ఏక్తా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులతో కలిసి వీధుల్లో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. బ్రహ్మంగారి మఠం సెంటర్‌లో ప్రమాణ కార్యక్రమం జరిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీల, ఎంపీడీవో శివన్నారాయణ, కళాశాల ప్రిన్సిపల్ గాయత్రి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని పద్మజ, పాఠశాలల, కళాశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కొల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ మాజీ ఉపప్రధాని, ఉక్కు మనిషి సర్ధార్ వల్లభాయ్‌పటేల్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొల్లూరు ఎంపీడీవో కె.నరసింహరావు, కార్యదర్శి బి.మల్లిఖార్జున ఏక్తా దివస్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి పోలీస్‌స్టేషన్ వద్ద పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పాఠశాల విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా పటేల్ జయంతి కార్యకర్తలు నిర్వహించారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సమైక్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీఎం రావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్ధార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కరస్పాండెంట్ పి.మల్లికార్జునరావు అధ్యక్షతన ఎంఈవో దేవరాజ్ పాల్గొని సత్యసాయి సేవా సమితి వారు అందించిన తైవాన్ జామ మొక్కలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రామకోటేశ్వరరావు, సేవా సమితి ప్రతినిధి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు కోటేశ్వరమ్మ, ఉమామహేశ్వరరావు, లక్ష్మీపార్వతి, లక్ష్మీ ప్రసన్న, మురళీధరరావు తదితరులు పాల్గొన్నారు.

● రేపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : భారతదేశపు ఉక్కుమనిషిగా పేరొందిన సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని ఏక్తాదివాస్‌గా జరుపుకోవటం సంతోషకరమని ప్రిన్సిపాల్ డాక్టర్ పీసీ రవిచంద్రకుమార్ అన్నారు. స్థానిక ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు పటేల్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్ టేకర్, కాసుల బాలగురవయ్య, వైస్ ప్రిన్సిపాల్ కె.కోటేశ్వరరావు, అధ్యాపకులు కె.భాస్కరరావు, ఎం.బుజ్జిబాబు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తూ ఆనందంగా వేడుక జరుపుకోవాలి : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజలంతా సరైన జాగ్రత్తలు పాటిస్తూ ఆనందోత్సవాల మధ్య దీపావళి పండుగ జరుపుకోవాలని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఈ విషయమై బుధవారం ఆయన మాట్లాడుతూ పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు. కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. బాణాసంచా విక్రయ దుకాణాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా తగిన భద్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయదుకాణాలలో సిద్ధంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించండి

● వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించేందుకు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కోరారు. బుధవారం ఆయన గుంటూరులోని ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కార్యాలయంలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల డైరెక్టర్లు, ప్రిన్సిపల్, లెక్చరర్స్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. హాజరైన ఆనందబాబు మాట్లాడుతూ ఆలపాటిని గెలిపించడం ద్వారా ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల్లోని గ్రాడ్యుయేట్స్ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సమావేశంలో శ్రీరామా రూరల్ విద్యా సంస్థల డైరెక్టర్ తులసి విష్ణు ప్రసాద్, సీవీఎస్ ధన్, పలు ప్రైవేట్ కళాశాలలు, ట్యూటోరియల్ డైరెక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

వేమూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరవలిపాలెం గ్రామానికి చెందిన విష్ణుమొలకల లక్ష్మి అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. చికిత్స నిమిత్తం ఖర్చు అయిన డబ్బును ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించి సహకరించాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు లక్ష్మి దరఖాస్తు చేశారు. ఆనందబాబు సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కు రూపంలో రూ.1,03,658 మంజూరు అయ్యాయి. సంబంధిత చెక్కును బుధవారం లక్ష్మి కుటుంబ సభ్యులకు ఆనందబాబు అందజేశారు. లక్ష్మి కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రముఖుల దీపావళి శుభాకాంక్షలు

బాపట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలకు అధికారులు, నాయకులు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌లు శుభాకాంక్షలు తెలియజేసి దుష్టశక్తులమీద దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ దీపావళి జరుపుకోవటం సంతోషదాయకమన్నారు. ఈపండుగ అందరి జీవితాలలో వెలుగులు నింపాలని వారు ఆకాంక్షించారు.

నేడు పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే నగదు ప్రోత్సాహకం

విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాలలో విశేష సేవలందించిన 90 మంది మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే నరేంద్రవర్మ వ్యక్తిగతంగా ఒక్కొక్కరికి రూ.5 వేలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. గురువారం ఉదయం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో కార్మికులకు నగదు ప్రోత్సాహకం అందజేస్తానని తెలిపారు.

కలెక్టర్‌ను సత్కరించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

బాపట్ల,అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎం.వెంకటేశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ జె.వెంకటమురళిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి మొక్క అందజేశారు.

డీఈవోను సత్కరించిన ఎస్టీయూ ఉపాధ్యాయులు

బాపట్ల,అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎస్.పురుషోత్తంను బుధవారం ఎస్టీయూ బాపట్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. రాష్ట్రంలో బాపట్ల జిల్లాను అగ్రస్థానంలో నిలపటంలో ఎస్టీయూ తన వంతు పాత్రపోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గుడివాడ అమర్‌నాథ్, బి.వెంకటేశ్వర్లు, ఎన్‌బి సుభాసీ, పివి నాగరాజు, గవిని శ్రీనివాస్, ఉదయ్‌శంకర్, శివాంజనేయులు, గూడారంకయ్య, టి.శివయ్య, బి.లక్ష్మీనారాయణ, టి.చంద్రయ్య, సీహెచ్ శ్రీనివాసరావు, ఏవీ నారాయణమూర్తి పాల్గొన్నారు.

మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

కర్లపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతనందాయపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్యక్రమం బుధవారం కర్లపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యేహూరి భూపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కుంచాల వెంకటశివ నాగిరెడ్డి, బాపట్ల నియోజకవర్గ ఐటీడీపీ ఉపాధ్యక్షుడు ఆట్ల బాల శంకర్‌రెడ్డి, బూత్ ఇన్‌చార్జి రావి శివరెడ్డి, నాయకులు అక్కల శ్రీనివాసరెడ్డి, పులిచర్ల నరేంద్ర రెడ్డి, రావి గోవిందారెడ్డి, గ్రామప్రజలు పాల్గొన్నారు.

పోలీసుల క్యాండిల్ ర్యాలీ

బాపట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల వారోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం రాత్రి బాపట్ల పట్టణంలో క్యాండిల్ ప్రదర్శన నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ ర్యాలీ ప్రారంభించి పోలీసు సిబ్బందితో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. బాపట్ల పట్టణ పోలీసు స్టేషన్ దగ్గర నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో డీఎస్పీ రామాంజనేయులు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యలంకలో వాహనాల పార్కింగ్‌కు వేలం

బాపట్ల రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా వాహనాల పార్కింగ్‌కు బుధవారం నిర్వహించిన వేలం పాట రూ.19 లక్షల 50 వేలకు ఓ వ్యక్తి కైవశం చేసుకున్నాడు. వాహనాల పార్కింగ్, టోల్‌గేటుకు పంచాయతీ వేలంపాట 18 లక్షలకు ఈవోపీఆర్డీ పులిశరత్‌బాబు, పంచాయతీ స్పెషలాఫీసర్, తహసీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవేలం పాటలో వసంత్ అనే వ్యక్తి 19లక్షల50వేలకు పాటను పాడుకోవటం జరిగింది. ఈ వేలం పాట రెండునెలలకు మాత్రమే వర్తిస్తుందని అధికారులు తెలిపారు.

ముందస్తు దీపావళి వేడుకలు

రేపల్లె, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి) : స్థానిక రామకృష్ణ పబ్లిక్‌స్కూల్లో ముందస్తుగా దీపావళి పండుగ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులతో దీపాలను అందంగా అలంకరించి పువ్వులతో ముగ్గులను తీర్చిదిద్ది ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కరస్పాండెంట్ కె.అపర్ణ మాట్లాడుతూ దీపావళి సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు టపాకాయలు కాల్చటంలో జాగ్రత్తలు వహించాలని సూచించారు. డైరెక్టర్ కె.మహేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి

● గాజుల్లంక, జువ్వలపాలెం ఇసుక రీచ్‌లను పరిశీలించిన ఆర్డీవో

కొల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ రవాణాపై అధికారులు చర్యలు తీసుకోవాలని, ఉచిత ఇసుక కోసం ఆన్‌లైన్ వాహన రిజిస్ట్రేషన్లపై అవగాహన కల్పించాలని ఆర్డీవో రామలక్ష్మి అధికారులకు సూచించారు. మండల పరిధిలోని గాజుల్లంక, జువ్వపాలెం ఇసుక రీచ్‌లను తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లుతో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. జువ్వలపాలెంలో వాహనదారులకు ఉచిత ఇసుక కోసం రిజిస్ట్రేషన్ విధానాన్ని వివరించారు. ఈపూరు, దోనేపూడి, చిలుమూరు, అరవింద వారధి, అనంతవరం, క్రాప తదితర రోడ్లలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా ఉండేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు కోసం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ఎస్‌ఐ ఏడుకొండలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఆన్‌లైన్ ఇసుక రిజిస్ట్రేషన్ గురించి వివరిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి : ఎంపీపీ

వేమూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేయాలని ఎంపీపీ యల్లమాటి మోహనరావు అన్నారు. స్థానిక రోశయ్య మీటింగ్ హాలులో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికి అందించే విధంగా అధికారులు సేవా దృక్పథంతో పని చేయాలన్నారు. ఎంపీడీవో శివన్నారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ నిధుల ద్వారా మండల పరిధి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. తహసీల్దార్ సుశీల, పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం పనుల కల్పనపై అవగాహన

కొల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం పనుల కల్పనపై ఏపీవో జె.లక్ష్మి కూలీలకు అవగాహన కల్పించారు. మండల పరిధిలోని ఆవులవారిపాలెం గ్రామంలో కూలీలతో బుధవారం ఆమె మాట్లాడుతూ సోమవారం నుంచి ఉపాధి పనులను కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ కిషన్‌బాబు, పంచాయతీ కార్యదర్శి గౌతమ్, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు సుబ్బారావు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

విద్యార్థుల విజయానికి మానసిక ధృడత్వం అవసరం

బాపట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల విజయానికి శారీరక, మానసిక ధృడత్వం అవసరమని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్ అధ్యక్షతన దీక్షారంబ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సూర్యలంక సముద్రతీరప్రాంతంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ ఎస్.వినోద్ పాల్గొన్నారు.

నైపుణ్య గణనపై శిక్షణ

బాపట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ సెన్సెస్‌లో భాగంగా బుధవారం నైపుణ్య గణన యాప్‌పై డిజిటల్ అసిస్టెంట్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్, న్యాక్ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో బాపట్ల, రేపల్లె, చీరాల డీఎల్‌డీవోలు సీహెచ్ సువార్త, పద్మజ, పద్మావతి తదితరులు శిక్షణ ఇచ్చారు. గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్ పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ గాయత్రి పాల్గొని నైపుణ్య గణన యాప్‌పై శిక్షణ ఇచ్చారు.

ఎమ్మార్పీకే మద్యం అమ్మకాలు జరపాలి

రేపల్లె, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : మద్యం ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని నగరం ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీరామ్‌ప్రసాద్ అన్నారు. ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం సర్కిల్ పరిధిలోని మద్యం దుకాణం యజమానులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధిక రేట్లకు అమ్మితే రూ.5 లక్షలు జరిమానా విధించటం జరుగుతుందని, రెండోసారి ఉల్లంఘించినట్లయితే షాపు రద్దు చేయటం జరుగుతుందని తెలిపారు.

వర్షంతో రైతుల ఆందోళన

కొల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో కొల్లూరు మండలంలో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. అల్పపీడనం వల్ల వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.